


# 23

# లెనిన్ ప్లేస్

వణుకుతున్న పాదాలతో ఆ గదిలోకి అడుగుపెట్టాను. గుండె దడ గది లోపల అందరికీ వినిపించేటంతగా. నా కళ్లు ఆ మనిషి కోసం వెతికాయి. రెండు రోజుల క్రితం, మధ్యాహ్నపు పూట- ఇరానీ హోటల్లో చాయ్ తాగుతుండగా, భుజంపై అతని చెయ్యి. కౌగిలించుకున్నంత పనిచేశాడు. "ఎంత గొప్పగా రాశావు. 'ద స్టాట్యూ ఈజ్ సింగింగ్' అసలు టైటిల్ అదరగొట్టావు. కూలిన లెనిన్ విగ్రహం, ఓల్డ్ లేడీ ఎగోనీ, గొప్పగా వచ్చింది కవిత. మంచి భవిష్యత్తు ఉంది నీకు! రేపో మిత్రురాలి యింట్లో చిన్న భేటీ ఏర్పాటు చేసుకున్నాము. అక్కడికి రా. కొత్తగా రాసిన కవిత ఏదైనా ఉంటే తీసుకు రా," అంటూ ఆహ్వానించాడు. జేబు లోపల కవిత. రహస్యంగా దాచుకొన్న పిస్తోలులా. ఇంతకీ ఆ మనిషి ఎక్కడ?

పదిమందికి పైగా ఉన్నారు అక్కడ. చాలా క్యాజువల్‌గా విసిరేసిన సామానుల్లా ఎక్కడికక్కడే. మానవ పద్యంలాగా ఒకళ్లకొకళ్లు అల్లుకుపోయి ఆర్ద్రంగా, ఉత్తేజంగా, విప్పారిన కళ్లతో ఉన్నారు. వాళ్ల మధ్యన ఆ మనిషి! ఖద్దరు లాల్చీ, సాదా సీదా పైజమా, అతి సహజంగా, నిర్భయంగా, ప్రేమగా. అతని పేరు కేశవరావు.

'పరిచయం చేసుకో!' అన్నట్లు నావైపు చూశాడు. చేతులు ముందుకు కదిలాయి. వెచ్చగా, బలంగా, మనసుని తాకేటంత బిగువుగా.

క్షణాల వ్యవధిలో ఒక బలమైన చర్చ సమూహాన్ని తాకింది. పోస్ట్-మోడరన్ ధోరణులపై, ఒకానొక యుద్ధాన్ని చేస్తున్నంత పట్టుదల. ఫెడేల్ ఫెడేల్‌మని కొడుతున్న దెబ్బల్లా, పరుషమైన పదాలు, వాక్యాలు గది నిండా దొర్లాడుతున్నాయి.

ట్రేలో ఇరవైకి పైగా టీ కప్పులు పట్టుకొని ఆమె మా మధ్యకు వచ్చింది. సంధ్య! సీనియర్ రైటర్. యూనివర్సిటీ మీటింగుల్లో తరచూ కనపడేది. అంతగా అలంకరించుకోని సొగసు. ఆమెను పలకరించాలనిపించింది. నోరు పెగల్లేదు. ఆమె చకచకా అందరికీ టీలు అందిస్తూ పోతోంది.

జయరాజ్, సాకీ, రషీద్- సెంట్రల్ యూనివర్సిటీ కుర్రాళ్లు హడావుడిగా లోపలికి దూసుకొచ్చారు. వస్తూనే ట్రేలోంచి టీ లాక్కున్నాడు రషీద్!

యూనివర్సిటీలో పరిచయమైన ముఖాలే. నేను క్యాంపస్ వదులుతుండగా ఈ కుర్రాళ్లు జాయిన్ అయ్యారు. వీళ్లంటే ఒక అలజడి! ప్రవాహం! గందరగోళం! హాస్టల్‌లో నా రూమే రషీద్‌కి ఎలాట్ చేశారు. నా సామానంతా అతనే ప్యాక్‌చేసి పెట్టాడు. వెళ్లేటప్పుడు అతని 'నిరంతరం' కవితా సంపుటి గుర్తుగా ఇచ్చాడు. గొప్ప కోపం. అనంతమైన దుఃఖం. ఇవి రాస్తున్నప్పుడు అతనో జ్వర సముద్రంలా ఉండి ఉంటాడు.

నావైపు గుర్తుపట్టనట్టుగా, అనాసక్తంగా చూశాడు. మిగిలిన ఇద్దరు కూడా అనీజీగా ఉన్నారు. వాళ్లు ముగ్గురూ యుద్ధాన్ని ప్రకటించడానికి వచ్చిన సిపాయిల్లా ఉన్నారు.

చర్చ కొనసాగుతూనే ఉంది. మౌనంగా ఒక మూలకు జరిగాను. జేబులోని కవిత బరువైన లగేజీలా అనిపించసాగింది. 'హలో!' భుజంపై చెయ్యిపడి ఉలిక్కిపడ్డాను. బరువైన చెయ్యి. "నా పేరు రాఘవరావు. న్యూ సిటీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్ని," అంటూ పరిచయం చేసుకున్నాడు నా పక్కనే కూలబడుతూ. "మీ ముఖంలో స్పార్క్ కనిపిస్తోంది. భవిష్యత్తుపై అధికారం ఉన్నవాడిలా కనిపిస్తున్నావు. నీ పక్కన కూర్చోనివ్వు," అన్నాడు గంభీరమైన ముఖంతో.

"ఆయన హిస్టరీ లెక్చరర్! ఆయన పాఠం వినడం గొప్ప అనుభవం," కేశవరావు పరిచయంగా చెప్పాడు.

"ఎస్! ఐ టీచ్ హిస్టరీ! అందుకే నేనెప్పుడూ ఎంతో అశాంతిగా ఉంటాను. ఐయామ్ రెస్ట్‌లెస్" చూస్తుండగానే రాఘవరావుగారి ముఖం ఎర్రగా మారింది. కోపమో! అశాంతో! కలవరపాటుతో ఉన్నాడు ఆయన.

"ఇవాళ జరిగిన సంఘటన మీకందరికీ చెప్పాలి. రష్యన్ రివల్యూషన్ గురించిన పాఠం చెబుతున్నాను. ఎప్పటిలాగే కుర్రవాళ్లతో ఒక స్పాంటేనియస్ ప్లే ఎరేంజ్ చేశాను.

క్లాస్‌రూమ్‌లో వ్లాడిమీర్ ఇలీయచ్ లెనిన్ ప్రత్యక్షమయ్యాడు. జార్ ప్రభుత్వం- 1910- బోల్షివిక్‌ల చేతిలోకి అధికారం రావడం- పెట్రోగ్రాడ్ స్టేజీపై గోర్కీ, మయకోవిస్కీలు- మధ్యలో ట్రాట్‌స్కీ హడావుడి. లెనిన్ చనిపోవటంతో ప్లే ముగుస్తుంది. లెనిన్‌గా వేసిన కుర్రవాడి ముఖంలో గొప్ప గర్వం కొత్త ప్రపంచాన్ని సృష్టించిన నేత ముఖంలో కనిపించే గర్వం- క్లాసులోని పిల్లలందరూ గొప్పగా థ్రిల్ అయ్యారు. కానీ చివరి బెంచీల్లో గొడవ మొదలైంది. నలుగురు కుర్రాళ్లు పైకి లేచి, నాటకాన్ని కొనసాగించాలని గొడవ పెట్టారు. గోర్బచేవ్, పెరిస్త్రోయికా, గ్లాస్‌నోస్త్‌లు గురించి మాట్లాడుకోవలసిందేనని అరిచారు. లెనిన్ విగ్రహం కూలిపోవటంతో ప్లే ముగించటం న్యాయమని వాదించారు. ఆ నలుగురు కుర్రాళ్ల ముఖంలో ఎంత శాడిజం! నేను గొప్పగా షాక్ అయ్యాను. క్లాస్ మధ్యలోనే ముగించి కోపంగా బయటకు నడిచాను. వాళ్లు వెనుక నుండి బిగ్గరగా అరుస్తున్నారు. "మనం వచ్చే క్లాసులో 'ది లాస్ట్ రైట్స్ టు కమ్యూనిజం!' అనే ప్లే ఆడుదాం సార్" అంటూ.

రాఘవరావు ముఖంలో బాధ, అశాంతి స్పష్టంగా తెలుస్తున్నాయి.

"మధ్యలో మీకెందుకు కోపం! మీరే లెనిన్ అయినంతగా బాధపడతారే," రషీద్ విసుక్కున్నాడు.

వాతావరణంలోని విసుగును గమనించి కేశవరావు- తన కొత్త కవిత ఒకటి బయటకు తీశాడు. అడవుల మధ్య వీచే రవ్వగాలిలా తీవ్రంగా, భయం గొలిపేలా ఉందాయన స్వరం. అడవులు కాలుతున్న శబ్దం. చెట్లు విరుచుకుపడుతున్న దృశ్యం. కాళ్ల కింద నేల వణుకుతున్న అనుభూతి.

విధ్వంస దృశ్యం అయిపోయాక, చాలాసేపు వింత ఉద్వేగం గదినంతా చుట్టు ముట్టింది. సంధ్య మరోసారి టీ, బిస్కెట్లు పట్టుకొచ్చింది.

రాఘవరావు టీ అందుకుంటూ, "సంధ్యమ్మా! ఒక్కక్షణం కూర్చో," అని పిలిచాడు.

ముంగాళ్లపై కూర్చుంటూ, "చెప్పండి సార్," అంది.

"స్టీఫెన్‌తో గొడవ సమసిపోయిందా? రాజీ ఏమైనా కుదిరిందా?"

సంధ్య ముఖంలో దిగులు. అంతలోనే ఒక నిర్లిప్తత, "ఆ కథ ముగిసిపోయింది. సార్! ఇద్దరం విడిపోవడానికి నిర్ణయించుకున్నాం. తనకు కావలసినవన్నీ తీసుకుని ఇల్లు వదిలివెళ్లాడు అతను!"

"ఆ పెళ్లి అట్లాగే నిద్రలో వచ్చే కలలా రహస్యంగా చేసుకున్నారు. ఇవాళ విడిపోవటం కూడా మెలకువ వచ్చినంత సులభంగా, సునాయాసంగా. మీ తరాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాను," రాఘవరావు దిగులుగా నిట్టూర్చాడు. సంధ్య ముఖంలో దు:ఖం! జ్ఞాపకాల్ని కెలుక్కోవటం మొదలుపెట్టింది.

ఐ హ్యాడ్ ఏ డ్రీమ్, టూ లివ్ లైక్ ఏ పోయెమ్! నా చిన్నతనంలో మాకో కుంచెడు పొలం ఉండేది. జనుము పంట వేసేవాళ్లం. ఏపుగా పెరిగి, పూలన్నీ విరిసి, మా నాయన

శరీరంలోని బలమంతా తాగి, ఆ పూలు పకపకలాడేవి! ఊరు చివర, ఒంటరి చేను. చేనులోనే మా పాక. పాక తలుపు తెరిస్తే, ఒక రంగుల స్వప్నం. ఆ చేనులో రోజల్లా నడుస్తూనే ఉండేదాన్ని. ఒక స్వప్నంలోంచి ఇంకో స్వప్నంలోకి నడుస్తున్నట్లుగా ఉండేది. దేనికోసమో నిరంతరం వెదుకుతున్నట్లుగా గడిపేదాన్ని. ఈ వెదుకులాటే నన్ను కవిని చేసింది.

నాలోకి నేను ముడుచుకుపోవటం నాకిష్టమైన పాస్‌టైమ్. ఏకాంతం నాకిష్టం! చాలాసేపు మనుషులతో గడపడం నాకు దుర్భరమే!

పద్నాలుగో యేట స్కూలు వదిలేశాను. చీరల్ని నేసే కోపరేటివ్ ఫామ్‌లో ఉద్యోగానికి చేరాను. అట్లా చీరల్ని నేయడం నాకెంతో ఇష్టంగా ఉండేది. కలల్ని పేనుతున్నట్లుగా ఉండేది. నూలుతో పూలతోటల్ని నిర్మిస్తున్నట్లుగా ఉండేది. ఆ రోజుల్లోనే చిన్న చిన్న కవితలు రాసి భద్రంగా దాచుకునేదాన్ని. పదహారేళ్లకు పెళ్లి చేసుకున్నాను. తివాచీలు నేసే మనిషి. పుట్టు గుడ్డి! నాకంటే ఇరవయ్యేళ్లు పెద్ద! అతను నేసే తివాచీ ఒక్కో కావ్యంలా ఉండేది. అతన్ని నేను, 'నాయనా!' అని పిలిచేదాన్ని. "అదంతా వేళాకోళం! పెళ్లా పాడా!" అని మా అమ్మ అంటుండే కానీ, నా వరకు అదో పెళ్లి! ఒక కలయిక!

"ఇరవై అయిదో యేట కమ్యూనిస్టు పార్టీలో చేరాను. అప్పటికే కవిగా నాకు పేరొచ్చింది. పార్టీలో ఉన్నప్పుడే స్టీఫెన్‌ని పెళ్లి చేసుకున్నాను. స్టీఫెన్ యూనివర్సిటీ రీసెర్చి స్కాలర్! 'కమ్యూనిజం- రష్యాలో వస్తున్న మార్పులు' అతని సబ్జెక్టు.

"రష్యా పతనం తరువాత దబ్బున నేలపై పడ్డట్టుగా అయ్యింది మా పరిస్థితి. స్టీఫెన్ పేపర్లో రిపోర్టర్‌గా చేరాడు. మా ఇంట్లోంచి దాస్ క్యాపిటల్, లెనిన్ సెలక్టెడ్ రైటింగ్స్, గోర్కీ సాహిత్యం ఎప్పుడు ఎట్లా అదృశ్యం అయ్యాయో, నాకు స్పష్టంగా గుర్తులేదు. రష్యా పతనమైన తొలిరోజుల్లో స్టీఫెన్ చాలా పిచ్చిగా ప్రవర్తించేవాడు. లెనిన్ ఫొటో తెచ్చి, దానికి బొట్టు పెట్టి, దండ వేసి కొంతసేపు మెడిటేషన్ కూడా చేసేవాడు. అప్పుడప్పుడు, "విను! ఆయన మాట్లాడుతున్నాడు! ద డెడ్ మ్యాన్ ఈజ్ స్పీకింగ్!" అని అరిచేవాడు.

"నెలరోజులపాటు ఈ తమాషా సాగింది. నేను సైలెంటుగా వాచ్ చేశాను. నెల రోజుల తరువాత ఆ ఫొటోను తీసుకెళ్లి ఒక దేవాలయం అరుగుపై పెట్టి వచ్చాడు. ఇంట్లో ఉన్న పుస్తకాలని తూకానికి అమ్మివేశాడు. రోజూ వస్తున్న పేపరును ఆపివేయించాడు.

"అప్పుడు కంప్యూటర్లు వస్తున్న రోజులు. ఇంటి దగ్గర పొలాన్ని అమ్మి, ఒక కంప్యూటర్ ఫామ్‌లో భాగస్వామిగా చేరాడు.

ఈ నాలుగేళ్లలో చాలా మార్పులు జరిగాయి. బిల్‌గేట్స్ స్టీఫెన్‌కి ఆరాధ్య దైవం అయ్యాడు. మారుతి, సెల్‌ఫోన్, కోక్, అమెరికన్ యాసతో ఇంగ్లిషు-

నన్నూ కన్స్యూమర్ ఆర్టికల్‌గా మారమంటాడు. ఈ కవితలు, కబుర్లు, ఫెమి నిజాలు, ఉద్యమాలు అన్నీ వదిలేయమంటాడు. మెయిన్ ఫ్రేమ్స్, కోబాల్ నేర్చుకో మంటాడు. అమెరికా వెళదాం అంటాడు.

"అందుకే రెబల్‌గా మారిపోయాను. నీతో సంసారం వద్దు అనేశాను. మా నాయన నలభై ఏళ్లకే పోయాడు. చేను బీడుపెట్టి మా అమ్మ, నాన్న చీరల మూటలు చంకలో పెట్టుకుని, మైళ్లకు మైళ్లు తిరగడం నాకింకా గుర్తుంది. నన్నని కాలిబాటల మధ్యన రెండు శవాల్లా వాళ్లు నడుచుకుంటూ పోవటం నాకు గుర్తుంది. ఈ దు:ఖం, ఈ రక్తం, మనుషులు శవాలుగా మారే ఈ చోటు వదిలి ఎట్లా వెళ్లను. స్టీఫెన్ చెప్పే కొత్త స్వర్గం గురించి నాకేమీ భ్రమలు లేవు. అందులో గొప్ప సుఖం కూడా కనబడలేదు."

వేడి వేడి టీ ఘుమఘుమల మధ్య సంధ్య కబుర్లు గుండెను బలంగా తాకాయి. ఆవిడంటే గొప్ప ఆరాధనాభావం కలిగింది.

"కొత్త మిత్రుడు రాజశేఖరం ఇప్పుడో కవిత చదువుతాడు," అంటూ నావైపు చూశాడు కేశవరావు. "ఇరవై యేళ్ల వయసులో చదువు మొదలుపెట్టి ఇవాళ ఎం.ఫిల్ వరకూ పూర్తిచేసిన మనిషి. చదవటం, నేర్చుకోవటం అతనికో ఉద్యమం. అతను కమ్యూనిస్టో కాదో తెలియదు గానీ రష్యా మీద రాసిన పోయెమ్ మాత్రం నన్ను గొప్పగా డిస్టర్బ్ చేసింది. కొత్త ఎక్స్‌ప్రెషన్. గొప్ప ఫ్లో ఉంది. రేపటి గొప్ప కవిని ఇవాళే మీకు పరిచయం చేస్తున్నాను."

కేశవరావు మాటలకు సిగ్గుగా, మొహమాటంగా చూశాను. జేబులోంచి కవిత బయటకు తీశాను.

తలుపు దగ్గర చప్పుడు. హడావుడిగా పరిగెత్తుకొచ్చినట్లుగా రత్నం. బట్టలు మాసి పోయి ఉన్నాయి. తలకు చిన్న బ్యాండేజి కూడా ఉంది. ఉస్మానియాలో మెడికో అతను. వైద్యం కోసం రెండుసార్లు అతన్ని కలిశాను.

"రాత్రి హాస్టల్లో గొడవైంది. ఎస్సీలం ఎ, బి, సి, డిలుగా విడిపోయి, ఒకళ్లపై ఒకళ్లం దాడి చేసుకున్నాం. రెండు ఫ్రాక్చర్లు, ఆరు గాయాలు, ఇరవై ఔన్సుల రక్తం, టన్నులకొద్దీ ద్వేషం," దిగులుగా, ఫిలసాఫికల్‌గా ఉంది అతని కంఠం. "కవిత ఏదో చదువుతున్నట్లు న్నారు. కానివ్వండి," అంటూ నావైపు తిరిగాడు.

సుదీర్ఘమైన కవిత. చదువుతున్నంతసేపూ పరిసరాల్ని మరిచిపోయాను. మనసుకు రెక్కలేవో మొలిచినట్లుగా అనిపించింది.

కవిత పూర్తి అయినాక, తన సంచీలోంచి రెండు ప్యాకెట్లు బయటకు తీశాడు రషీద్. టీ తీసుకురావడానికి వెళుతున్న సంధ్యను ఆపి, "చిన్న పుస్తకావిష్కరణ కార్యక్రమం పెట్టుకుందాం. తరువాత టీ తాగుదాం," అన్నాడు అభ్యర్థనగా.

జయరాజ్ పైకి లేచి నిలబడి ఉపన్యాసం చెబుతున్న ధోరణిలో, "ఇప్పుడో పత్రికను అవిష్కరించుకుందాం. పోస్ట్-కమ్యూనిజమ్ ఎరాలో, భారతదేశంలో వస్తున్న ఆలోచనా ధోరణులకు సింబాలిజమ్ ఈ 'న్యూ వేవ్' పత్రిక. విప్లవ వాదం, వీర విప్లవవాదాల యుగం తరువాత తాపీగా నిలబడి అందరం సమీక్షించుకుంటున్న తరుణం ఇది. దళితవాదం, మైనారిటీవాదం, స్త్రీవాదం ప్రత్యేక వాదాలుగా జనం అంగీకరిస్తున్న సమయం. ఈ నేపథ్యంలో వస్తున్న పత్రిక ఇది. ఈ పత్రిక, ఆలోచనా రూపకల్పన మోహన సుందరానిది. దీనికి ఫౌండర్ ఎడిటర్ కూడా అతనే. దురదృష్టవశాత్తూ పదిరోజుల క్రితం మోహన సుందరం అదృశ్యం అయ్యాడు. అతని ఆచూకీ కూడా తెలియలేదు. అతను లేకుండా ఈ ఆవిష్కరణ చేసుకోవటం గొప్ప రిగ్రెట్ మాకు. ఇప్పుడు కేశవరావుగారు వచ్చి పత్రికను ఆవిష్కరిస్తారు," అన్నాడు.

కవరు విప్పి పత్రిక బయటకు తీశాడు కేశవరావు. కెమెరాతో రెండు మూడు స్నాప్‌లు తీశాడు రషీద్.

"మోహనసుందరాన్ని చాలాసార్లు యూనివర్సిటీలో కలిశాను. గొప్ప ఫిలాసఫర్! ఆశావాది. దళిత ఈస్థటిక్స్ మీద అథారిటీ! మంచి కార్యకర్త కూడా. 'కాంపస్‌లిట్లా డ్రైగా, స్తబ్ధంగా ఉంటే ఎట్లా?' అనేవాడు. అతనికి కమ్యూనిజమ్ మీద మంచి గురి. అతని ఇంటికి 'లెనిన్ ప్లేస్' అని పేరుపెట్టుకున్నాడు. ఈ పత్రిక సాహిత్యంలో ఒక మలుపు. చరిత్ర చేసుకుంటున్న ఆత్మ విమర్శ," కేశవరావు ఉపన్యాసానికి అందరం చప్పట్లు కొట్టాం.

మోహనసుందరం గురించిన ముచ్చట్లు. "ఎట్లా మాయమయ్యాడు?" అందరిలో అదే ప్రశ్న.

"రోజూ ప్రెస్‌లో కలిసేవాళ్లం. ప్రూఫులు దిద్దటం దగ్గరుండి చేసేవాడు. పది రోజుల నుండి ప్రెస్‌కు రావటం మానేశాడు. రెండు రోజులు చూసి నేనే అతని ఇంటికి వెళ్లాను. 'లెనిన్ ప్లేస్' అని అపార్టుమెంటు పేరు. రాంనగర్‌లో ఉంది. అపార్ట్‌మెంట్ తలుపు తీసుంది. బయట నుండి లోపలి గదులన్నీ కన్పిస్తున్నాయి. పక్క అపార్ట్‌మెంట్ వాళ్ల నడిగితే, రెండు రోజులుగా ఆ తలుపు అట్లాగే తీసి ఉందని చెప్పారు. కథల్లోలాగా వున్న పళంగా మాయమయ్యాడా మనిషి. టేబుల్‌పై రాస్తూ రాస్తూ వదిలేసిన నోట్స్, పెన్ అలాగే ఉన్నాయి. టేబుల్ ల్యాంప్ వెలుగుతూనే ఉంది. లోపలంతా నిర్మానుష్యం. పక్క అపార్ట్ మెంట్‌వాళ్లు పోలీసులకు కబురుచేసి, దానికి సీల్ వేయించాలనుకుంటున్నామని చెప్పారు," వణుకుతున్న గొంతుతో రషీద్.

హఠాత్తుగా ఒక మౌనపు తెర. గది గుండెలో గుబులు. మౌనాన్ని చీలుస్తూ కేశవరావు ఒక ఇంగ్లిష్ కవితను చదవటం మొదలుపెట్టాడు. అమ్మను గురించిన కవిత. పోలిష్

కవితకు అనువాదం అది. కమ్యూనిస్టు ప్రభుత్వం కూలిపోయిన సందర్భంలో దేశమంతా వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. వీధి చివరన ఆమె ఒక్కతే ఎర్రజెండా పట్టుకొని, నిలబడుతుంది. కొడుకు వచ్చి, 'నన్నిట్లా అవమానిస్తావా?" అని అడుగుతాడు. "నాది తల్లి మనసు! ఇంకా పుట్టని కొన్ని వందల వేల శిశువుల కోసం ఇక్కడ నిలబడ్డాను. వాళ్లకి లాంటి ఒక జెండా అయినా ఉందన్న విషయం తెలియాలి కదా!" అంటుంది. కేశవరావు ఆ కవితను తెలుగులోకి అనువదించి, అర్థం చెబుతుంటే అందరం ముగ్ధులం అయ్యాము.

సంధ్య అమ్మ పైన ఈమధ్యనే పబ్లిష్ అయిన కవితా సంకలనం తెచ్చింది. అందు లోంచి తనకు నచ్చిన పోయెమ్ చదివింది. ఆ తరువాత మరొకటి, మరొకటి. గదిని 'అమ్మ' అనే అనుభూతి ఆవహించింది. గది మెత్తని అమ్మ ఒడి అయింది. మౌనంగా వినబడే జోలపాట అయ్యింది.

నాలో ఉద్వేగం, "అమ్మ గురించిన కవిత కాదు గానీ, అమ్మ గురించిన ముచ్చట చెబుతాను," అంటూ గొంతు సవరించుకున్నాను.

"అక్షరాలు రాని పల్లెటూరి అమ్మ! నేను కవిత్వం రాస్తానంటే- అర్థం కానట్లు ముఖం పెట్టే అమ్మ! వేకువజామున పక్షుల కన్నా ముందే నిద్రలేచి ఏడు గంటలకే అన్నం వండి నన్ను బడికి తయారుచేసేది. పాతకాలపు సైకిలు, చాలీచాలని బూట్లు- ఒక ప్రతీకలా ఇంటి ముందు అలంకరించి, 'మా బుడ్డోడివి, ఇస్కూలుకి ఏసుకెళ్లేవాడు,' అని, ఇవాల్టికీ కథలు కథలుగా చెప్పుకుంటుంది మా అమ్మ.

"బడి మానేసి తూరుపు పొలాల వైపుకు రెండు నెలలు వరికోతలకు వెళ్లి రెండు వేల దాకా డబ్బు తెస్తే, ఆ డబ్బులు దయ్యాలుగానో, భూతాలుగానో చూసినట్లు చూసి అమ్మ ఏడవటం ఇంకా గుర్తు ఉంది.

"పల్లెల్లో కుర్రవాళ్లు చదువు జోలికి పోరు. తాగుడు, అమ్మాయిల వెంట పడటం, గ్రూపులుగా చీలి కొట్టుకోవటం. ఈ బతుకు మంచిదికాదని వాళ్లకు చెప్పడానికైనా చదువుకొమ్మని నన్ను పోరేది.

"అమ్మ మాటలు చెవికెక్కలేదు. కొత్త అలవాట్లు. విశృంఖలత పాదరసంలా శరీరంలో ప్రవహించేది. 'వాడు రాకాసోడు' అని జనంతో అనిపించుకున్న రోజులు. ఒక ఆడకూతురు చెయ్యి పట్టుకుని, గొడవలై నలుగురు మూగి, కొట్లాటలై, కొట్లాటలో ఒకడి చెయ్యి నరికాను. పోలీసులు, జైలు. అమ్మ గుండెలు బాదుకుంటూ ఏడ్చింది.

"జైలు నుంచి వచ్చి నాకే నేను చదువు మొదలుపెట్టాను. అప్పటికి నా వయసు ఇరవై యేళ్లు. అందరూ వెక్కిరించేవాళ్లు. ఈ వయసులో చదువా అని. అమ్మ ఒక్కతే గురువులా, స్నేహితుడిలా ప్రోత్సహించేది.

ఈ నాజూకు భాష, ఈ కవిత్వం, ఈ ఉద్యోగం, ఈ కవి మిత్రుల పరిచయాలు- అన్నీ అమ్మ పెట్టిన భిక్షే!"

చాలాసేపటివరకు అమ్మ గురించి కబుర్లే అక్కడ దొర్లాయి. వాతావరణం సెంటిమెంటల్‌గా మారింది.

కేశవరావు, "బండీరా! పొగ బండీరా!" అంటూ జానపద గీతం ఎత్తుకున్నాడు. ఏటిగట్టు, ఒంటరి బాట, పరుగెత్తే రైలుబండి కళ్లముందు నిలిచింది. ఆ తరువాత సంధ్య 'శక్తికై నడు! విముక్తికై నడు' శ్రీశ్రీ గీతం పాడింది. క్రమంగా వాతావరణంలో హుషారు చోటు చేసుకుంది. వెల్లువలా హుషారు. సాయంకాలం అయినట్లుంది. సూర్యుడి వెలుతురు తగ్గుతోంది. ఒక్కొక్కరమే లేచి గుండెల్ని సర్దుకుని, హుషారునంతా మూటగట్టి రేపటి కోసం దాచుకుని, గుడ్‌బైలు చెప్పుకొని బయటకు నడుస్తున్నంతలో...

బయట వీధిలో అలజడి. సముద్రపు అల విరిగిపడినట్లుగా జనం. మసక మసకగా ఉన్న పరిసరాల్లో వెలుగు దీపాల్లా జనం. ఎర్రగా, నల్లగా, రకరకాల రంగుల్లో రూపురేఖల్లో మనుషులు. మనుషుల మధ్య రెపరెపలాడుతూ ఎర్రజెండాలు. "అక్టోబర్ విప్లవం 75వ వార్షికోత్సవం వర్ధిల్లాలి!" అంటూ నినాదాలు. రాఘవరావు ఆ ఊరేగింపు చూసి ముగ్ధుడయ్యాడు. విప్పారిన కళ్లతో మాకు టాటా చెబుతూ ఊరేగింపులో కలిసి పోయాడు.

"కమ్యూనిజమ్ డౌన్ డౌన్," ఊరేగింపుతో సహా అందరం ఉలిక్కిపడ్డాము. వీధి లాంతరు కింద నిలబడ్డ నడికారు మనిషి ఎలుగెత్తి అరిచాడు. "ఎర్రమందు నిషాలో కొట్టుకుపోతున్న కామ్రేడ్స్ డౌన్ డౌన్," ఆ మనిషి అరుస్తూనే ఉన్నాడు. బహుశా తాగి ఉన్నాడేమో! ఫటేమంటూ అతని మూతిపై దెబ్బపడింది. మరో దెబ్బ! మరో దెబ్బ! దబ్బున నేలపై జారిపడ్డాడు. ఊరేగింపు ముందుకు కదిలింది.

ఆ తమాషా అయినాక పడిపోయిన మనిషి చుట్టూ వీధి జనం మూగారు. "నన్ను బతికించండి! నన్ను బతికించండి," పెద్దగా అరుస్తున్నాడు ఆ మనిషి.

దూరంగా వస్తున్న ఆటో ఆపి కేశవరావు ఎక్కాడు. అతనితో పాటు, రాజు, సాకి, రషీద్ కూడా బయలుదేరారు. రత్నం కాలినడకన బయలుదేరాడు.

"శేఖరం," సంధ్య తలుపువార నుండి పిలిచింది. "నాతో ఒకచోటికి తోడు రాగలవా?" తలుపుకు తాళం వేస్తూ సంధ్య.

"మోహనసుందరం గదిని చూడాలని ఉంది."

సంధ్య వెంట రాంనగర్ 'లెనిన్ ప్లేస్'వైపు అడుగువేస్తూ నేను.

'లెనిన్ ప్లేస్' రెండవ అంతస్థులో ఉన్న అపార్ట్‌మెంట్ అది. కారిడార్ అంతా చీకటిగా ఉంది.

తెరిచిన తలుపులోంచి లోపలికి అడుగువేశాం. లోపల సన్నని దీపపు వెలుగు. గోడల నిండా ఫొటోఫ్రేములు. లెనిన్, మార్క్స్, గోర్కీ, ఇంకోవైపు అంబేద్కర్, పూలేల ఫొటోలు.

గదుల నిండా దుర్వాసన. శవం కుళ్లుతున్న వాసన. నాలుగువైపులా తిరిగాం. అన్ని గదులు వెతికాం. నిర్మానుష్యంగా, నిశ్చలంగా చాలా యేళ్లుగా అదే భంగిమలో ఉన్నట్లుగా కుర్చీలు, బల్లలు, మంచం, పుస్తకాల గుట్టలు.

ఒక గదిలో కుడివైపునున్న గోడపై 'విలాస్ గోగ్రే' బాటలో పయనిస్తూ 'మో.సు' అని రాసి ఉంది.

మరో గోడపై "ఒకళ్లపై ఒకళ్లు కత్తులు దూసుకుంటున్న దళిత సోదరుల కోసం దు:ఖంతో మో.సు." అని రాసి ఉంది.

చాలాసేపటి తర్వాత గది నుండి బయటపడ్డాం. దుర్భరమైన శవం కుళ్లుతున్న వాసన మాత్రం మమ్మల్ని వెంటాడుతూనే ఉంది.

*21 డిశంబర్ 1997, సుప్రభాతం వీక్లీ*
*ఇండియన్ లిటరేచర్, 2003*
*పెంగ్విన్ 'ది మాన్ ఆన్ ది రోడ్', 2007*